క్లుప్తంగా

వైద్యశిబిరానికి విశేష స్పందన



దాచేపల్లి : స్థానిక రంగనాయక స్వామి ఆలయంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పిడుగురాళ్ల డాక్టర్ అంజిరెడ్డి హస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, సీఐ షేక్ బిలాలుద్దీన్, డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. బీపీ, షుగర్, థైరాయిడ్, న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, కార్డియాక్, ఎముకలు, స్త్రీల సంబధిత రోగాలకు పరీక్షలు నిర్వహించారు. 270మందికిపైగా ఉచితంగా వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి మందులు అందించారు. రోగాలబారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై డాక్టర్లు నాగుల్‌మీరా, సృజన, రజిత, నరేంద్ర వివరించారు. శిబిరంలో స్థానిక నాయకులు మునగా శ్రీనివాసరావు, కొమ్ము బుజ్జి, అచ్చాల శ్రీనివాసరావు, బండ్ల మరియదాసు, మునగా శ్రీకాంత్, హస్పిటల్ మేనేజర్ డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోగులపాడులో వైఎస్సార్ క్రికెట్ టోర్నీ

గురజాల : గోగులపాడు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు. గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ తిరునాళ్లను పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 29 నుంచి ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. మొదటి బహుమతి రూ.50,116, రెండో బహుమతి రూ.30,116, మూడో బహుమతి రూ.20,116 అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 62811 56740, 9347272376, 9398589139 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



రెంటచింతల: గ్రామదేవతైన ముత్యాలమ్మ ఆలయ 12వ వార్షికోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రేష్టి శ్రీనివాసశర్మ నేతృత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల అభిషేకాలు, పలు పూజా కార్యక్రమాలను జరిపించారు. వందలాదిమంది భక్తులు పాల్గొని ముత్యాలమ్మకు మొక్కుబడులు చెల్లించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ పర్యవేక్షకులు వల్లెర్ల కోటిరెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, పులిహోర పంపిణీ చేశారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, కౌన్సిలర్లు కొక్కెర శ్రీనివాసరావు, గర్నె నాగేశ్వరరావు, జులకంటి శ్రీనివాసరావు, డాక్టర్ ఎంబీ నవీన్‌కుమార్, మేనేజర్ ఎం. కృష్ణ ప్రసాద్, చైర్మన్ ఏ. నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాత్సల్య పథకానికి నెలాఖరు లోపు దరఖాస్తు చేసుకోవాలి

కారెంపూడి: 'మిషన్ వాత్సల్య' పథకం ద్వారా లబ్ధి కోసం ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. తల్లిని కాని తండ్రిని కాని కోల్పోయి నిరాశ్రయులైన 18 ఏళ్ల లోపు పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందని, అర్హులైన వారికి ప్రభుత్వం ఏడాదికి రూ.4 వేలు ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు. దరఖాస్తులు స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో లభ్యమవుతాయని వెల్లడించారు.

ఈదురుగాలులతో వర్షం

మాచర్ల: పట్టణంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఈదురు గాలులు వీచాయి. ఫ్లెక్సీలు, చెట్లు కూలిపోయాయి. పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. కూలిన చెట్లను సిబ్బంది తొలగించారు. విద్యుత్ అధికారులు సరఫరాను పునరుద్ధరించారు.

నిద్రమత్తులో లారీ బోల్తా

గురజాల : నిద్రమత్తులో లారీ బోల్తా పడిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. పాదిలి నుంచి రాజస్థాన్‌కు రూ.11 లక్షల విలువ చేసే రాయిని తీసుకువెళ్తున్న తరుణంలో చర్లగుడిపాడు లాముల వద్ద లారీ బోల్తా పడింది. డ్రైవర్ చెన్న కేశవులు నిద్రమత్తులో ఉండి వాహనం నడుపుట వలనే ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు.

సేవా స్వచ్ఛవాలయాలు

- ఉత్తమ పౌర సేవలకు వేదికలు
- సిద్ధిస్తున్న గ్రామ స్వరాజ్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కొత్తగా నిర్మించిన ముటుకూరు-1 సచివాలయ భవనం

దుర్గి: పల్లెసీమలే పట్టుకొమ్మలు, గ్రామ స్వరాజ్యంతోనే దేశ ప్రగతి సాధ్యమని బలంగా నమ్మిన జాతిపిత మహాత్మాగాంధీ కలలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సాకారం చేస్తోంది. పల్లెల్లో ప్రజల ముంగిళ్లలోకే పాలనను తీసుకొచ్చింది. సమస్య ఏదైనా గ్రామంలోనే పరిష్కరించేలా గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. భారీగా ఉద్యోగులనూ నియమించింది. ఫలితంగా ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతున్నాయి. ఒకప్పుడు ఏదైనా పని ఉంటే మండల కేంద్రానికి వ్యయప్రయాసలకోర్చి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ లేకపోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల పనితీరు భేష్ అంటూ కొనియాడుతున్నారు.

11 గ్రామ సచివాలయాలకు భవనాల నిర్మాణం

మండలంలో మొత్తం 11 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయగా, వీటన్నింటికీ ప్రత్యేక భవన నిర్మాణాలను అధికారులు ప్రారంభించారు. ఇప్పటికే ముటుకూరు-1, అడిగొప్పల-1, ధర్మవరం సచివాలయ భవనాలకు ప్రారంభోత్సవం జరిగింది. మిగిలిన 8 సచివాలయాల భవన నిర్మాణ పనులు 85శాతం పూర్తయింది. తుది మెరుగులు దిద్దుతున్నారు. ప్రతి సచివాలయంలో అత్యాధునిక కంప్యూటర్, నిరంతరం ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. సచివాలయాల్లో దాదాపు 540 పౌర సేవలను నిత్యం ప్రజలకు అందిస్తున్నారు. ప్రతి సచివాలయంలో 10 నుంచి 12 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. వీరిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ, అజమాయిషీ ఉంటుంది. సచివాలయ సిబ్బంది సచివాలయానికి 250 మీటర్ల లోపలే తమ మొబైల్‌లో తమ అటెండెన్స్ అప్‌లోడ్ చేసే ఏర్పాటు చేశారు. ప్రజలకు రోజూ సాయంత్రం 3గంటల నుంచి 5గంటల వరకు ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు స్పందన కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది కొనసాగిస్తున్నారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

8 సచివాలయాల భవన నిర్మాణాలు త్వరలో పూర్తి



ధర్మవరం, ముటుకూరు-1, అడిగొప్పల-1 సచివాలయాల భవనాల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ప్రారంభోత్సవం కూడా జరిగింది. మిగిలిన 8 సచివాలయాల భవనాల నిర్మాణం రెండుమూడు నెలల్లో పూర్తిచేస్తాం. నిర్మాణాలు నాణ్యంగా చేపట్టాం. ఎక్కడా రాజీ పడలేదు.

– ఎస్.వెలుగొండారెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ

ప్రతి పౌరుడికీ పారదర్శకంగా సేవలు



ప్రతి పౌరుడికీ పారదర్శకంగా సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు వ్యక్తిగత సమస్యలను సచివాలయాల ద్వారా పరిష్కరిస్తున్నాం. ఇంత గొప్ప వ్యవస్థలో నేను భాగస్వామిని కావడం ఆనందంగా ఉంది.

– జె.రాజ్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్, ముటుకూరు-1

దూరాభారం, ప్రయాస లేదు



గత నెలలో మా పిల్లల పెళ్లి దేవాలయంలో జరిపాం. మ్యారేజి సర్టిఫికెట్ కోసం సచివాలయానికి వచ్చా. గతంలో ఏదైనా పని ఉంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. దూరాభారంతోపాటు వ్యయం కూడా అయ్యేది. ఇప్పుడు ఆ అవస్థలు లేవు. హాయిగా ఊళ్లోనే అన్ని సేవలూ అందుతున్నాయి. ఆనందంగా ఉంది.

– రమావత్ మహానుభావుడు నాయక్, నెహ్రూనగర్ తండా

గొప్ప వ్యవస్థ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం అద్భుతం. ఇది గొప్ప వ్యవస్థ. ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రజలు వందశాతం సంతృప్తిగా ఉన్నారు.

– తోటకూర నాగేశ్వరరావు, సర్పంచ్, ముటుకూరు

భర్త వృద్ధాప్య పింఛన్ కోసం వచ్చా



నేను, నా భర్త పొలం పనులకు వెళ్తాం. నా భర్త వృద్ధాప్య పింఛన్ మంజూరు కోసం వచ్చాను. గతంలో కార్యాలయాలకు వెళ్తే అంతా గందరగోళంగా ఉండేది. ఇప్పుడు సచివాలయ సిబ్బంది సమస్య అడిగి తెలుసుకుని అన్ని పత్రాలూ వారే నింపి ఆన్‌లైన్ చేస్తున్నారు. పింఛన్ త్వరలో వస్తుందని చెప్పారు. చాలా ఆనందంగా ఉంది.

– దొండపాటి రాములమ్మ, ముటుకూరు

సదరన్ సర్టిఫికెట్ వేగంగా వచ్చింది



నా కుమారుడు రాజు వికలాంగుడు. అతడి సదరన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశా. మా గ్రామంలోని సచివాలయ సిబ్బంది వేగంగా ఆన్‌లైన్ చేసి సర్టిఫికెట్ మంజూరు చేశారు. ఇంత త్వరగా వస్తుందనుకోలేదు. సిబ్బందికి కృతజ్ఞతలు. ఇంత గొప్ప వ్యవస్థను ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– చదమల జగన్నాథరావు, కంచరగుంట

మెడికల్ హబ్‌గా పిడుగురాళ్ల

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతంలోని పిడుగురాళ్ల మెడికల్ హబ్‌గా మారబోతోందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పల్నాడు ప్రాంతం అభివృద్ధికి నిర్మితమవుతున్న మెడికల్ కాలేజీకితోడు అదనంగా నర్సింగ్ కాలేజీ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లగా వారు దానికి ఆమోదం తెలపటం హర్షణీయమన్నారు. ఈ ప్రాంతం వెనుకబాటు గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే గతంలో మెడికల్ కాలేజీ మంజూరు చేశారని మహేష్‌రెడ్డి గుర్తుచేశారు. మెడికల్ కాలేజీకి రూ.200 కోట్లు కేంద్రం మంజూరు చేసిందని, ఇప్పుడు నర్సింగ్ కాలేజీ గురించి కోరగా దానికీ ఆమోదం తెలిపిందని వివరించారు. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మాచర్లల్లో డిగ్రీ కాలేజీ, 1980లో ఎంపీగా ఉన్న సమయంలో దాచేపల్లి, పిడుగురాళ్లల్లో జూనియర్ కాలేజీలు వచ్చాయని గుర్తుచేశారు. మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మెడికల్ కాలేజీ, హాస్పిటల్, నర్సింగ్ కాలేజీ వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. పిడుగురాళ్ల, దాచేపల్లి మధ్యలో కాలేజీల నిర్మాణం జరుగుతుందని వివరించారు. టీడీపీ హయాంలో ఒక్క జూనియర్ కాలేజీ, లేదా స్కూల్ అయినా నిర్మించారా అని కాసు మహేష్‌రెడ్డి ప్రశ్నించారు.

వరికపూడిసెల వర ప్రదాతకు క్షీరాభిషేకం

దుర్గి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వరికపూడిసెల ప్రాజెక్టు సాకారమవుతోందని వైఎస్సార్ సీపీ నాయకులు మాదాసు వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కంచరగుంట గ్రామంలో, సచివాలయం ఆవరణలో సీఎం జగన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం రైతు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ పీఆర్కే, ఎంపీ లావు కృష్ణదేవరాయలు, వైఎస్సార్ సీపీ జోనల్ విభాగం ఇన్‌ఛార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ప్రాజెక్టు అనుమతుల కోసం అహర్నిశలూ శ్రమించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర్నీడి మాణిక్యరావు, ఎంపీటీసీ బొంతా కృష్ణ, నాయకులు మాదాసు వాసు, దర్శి కృష్ణయ్య, సచివాలయ కన్వీనర్ మాదాసు శ్రీరామమూర్తి, కల్లూరి రాజేష్, కోటా రాజు, బొంతా చంద్రయ్య, కుందుర్తి వెంకటేశ్వరరావు, ముచ్చు సుబ్బారావు, అంజయ్య, అనవాలు తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిసెలతో పల్నాడు సస్యశ్యామలం

వెల్దుర్తి: వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణంతో పల్నాడు ప్రాంతం సస్యశ్యామలమవుతుందని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతునాయక్ ఆనందం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పల్నాడు ప్రాంత వాసుల ఏడు దశాబ్దాల కల అయిన వరికపూడిసెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులను కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకొచ్చి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్న సీఎం జగన్, ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలకు పల్నాడు ప్రజలు, రైతులు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన



బలప్రదర్శన పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, సర్పంచ్ సురేష్



ఎడ్ల బల ప్రదర్శనలో బండలాగుతున్న ఎడ్లజత

దాచేపల్లి : స్థానిక వీర్ల అంకమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్లబల ప్రదర్శన పోటీలు గురువారం హోరాహోరీగా జరిగాయి. జతపళ్ల విభాగంలో జరిగిన ఈ పోటీలను పిడుగురాళ్ల జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, సర్పంచ్ జంగా సురేష్ ప్రారంభించారు. శ్యావల్యాపురం మండలం ముతుకుమనికి చెందిన ముండు జీవప్రసాద్, గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి సంయుక్త ఎడ్లజత నిర్ణీత సమయంలో 4వేల అడుగుల దూరం బండను లాగి విజేతగా నిలిచాయి. దాచేపల్లికి చెందిన యామర్తి బాబు, యామర్తి శైలేంద్రయాదవ్ సంయుక్త ఎడ్ల జత 3,750 అడుగుల దూరం బండను లాగి రెండవ స్థానంలో, ఇంకుర్తికి చెందిన మందనబోయిన పోతురాజు యాదవ్ ఎడ్లజత 3,620 అడుగుల దూరం బండనులాగి మూడోస్థానంలో, గురజాలకు చెందిన లింగా అంజయ్య చౌదరి ఎడ్లజత 3,400 అడుగుల దూరం బండను లాగి నాలుగో స్థానంలో, మాచవరం మండలం రుక్మిణీపురానికి చెందిన యామర్తి వెంకటేశ్వర్లు యాదవ్ ఎడ్ల జత 3,206 అడుగుల దూరం బండను లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్ల జతల యజమానులకు దాతలు ఆకూరి వీరారెడ్డి, సలాం మేస్త్రీ, అక్కినపల్లి మోహన్, గుండ్రెడ్డి విష్ణుమూర్తి, అనంత కోటేశ్వరరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, అక్కినపల్లి బాలయ్య, కరణం శ్రీను నగదు, షీల్డ్స్ బహుకరించారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా దుర్గి శ్రీనివాసరావు వ్యవహరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అంబటి నవకుమార్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ యర్రంశెట్టి సైదారావు, మాజీ సర్పంచ్‌లు మునగా నిమ్మయ్య, మాశెట్టి పుల్లారావు, కమిటీ సభ్యులు కొప్పుల గిరి, అనిశెట్టి శ్రీనివాసరావు, దిలిప్, కొప్పుల రవికుమార్, కూరకుల ప్రశాంత్ పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటాం



ఈద్గా నిర్మాణంకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

దాచేపల్లి : ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటోందని ఎంపీపీ కటకం జయశ్రీ చెప్పారు. మండలంలోని పొందుగల గ్రామంలో ఈద్గా నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. రూ.25లక్షలతో పొందుగలలోని ముస్లింలకు ఈద్గా నిర్మిస్తామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హామీ ఇచ్చారు. ముస్లింలకు ఇచ్చిన హామీ మేరకు ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మండపాటి రమేష్‌రెడ్డి తదితరులు ప్రత్యేకంగా నమాజ్ చేసి ఈద్గా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నియోజకవర్గంలోని ముస్లిలకు రాజకీయంగా, సామాజికంగా అండగా ఉన్నారని చెప్పారు. జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ముస్లింలను గుండెల్లో పెట్టుకుని ఎమ్మెల్యే కాసు చూసుకుంటున్నారని, అన్ని రంగాల్లో వారి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ తండా బుడేసా, ఉపసర్పంచ్ షేక్ ఇమామ్‌వలి, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, పార్టీ మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, గ్రామ కన్వీనర్ తండా అజీజ్, నాయకులు తండా దావుద్, డీలర్ బడేసా, నాయకులు షేక్ సైదా, తండా హస్సన్, ముడి విక్టర్‌పాల్, ఎఈ శ్రీనివాసనాయక్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికే వైఎస్సార్‌సీపీలో పదవులు

కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడిగా పుల్లారెడ్డి ఎంపిక



కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడు పుల్లారెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న పీఆర్ఆర్

వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడుగా పట్లవీడు గ్రామానికి చెందిన తాడికొండ పుల్లారెడ్డిని ఎంపిక చేసినట్లు మూడు జిల్లా రీజినల్ కన్వీనర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి చెప్పారు. గురువారం మాచర్ల పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పుల్లారెడ్డికి నియామక పత్రాన్ని అందించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసిన వారికి పదవులు వాటంతట అవే వస్తాయన్నారు. పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, మాజీ సర్పంచ్‌లు కోనుగుంట శ్రీనివాసరెడ్డి, గుండెబోయిన నాగేశ్వరరావు, చౌడయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు అమరలింగం, మల్లికార్జునరెడ్డి, మణికంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


రెంటచింతల: స్థానిక యాదవరాజుల బజారులోని శ్రీ సువర్చలా సహిత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం విజయకుమార్ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. మధ్యాహ్నం మహిళలు పూజా కార్యక్రమాలను నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. 12 గంటల నుంచి భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఆలయాన్ని అందంగా అలంకరించారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

రెంటచింతల: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని ఏపీ ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏడీఈ గురజాల తుమ్మల విరేశ్వరరావు హెచ్చరించారు. గురువారం డీఈ జె.హరిబాబు ఆధ్వర్యంలో ఆయన ఏఈ మస్తాన్‌వలితో కలిసి రెంటచింతల, రెంటాల, పాలువాయి గ్రామాలలోని విద్యుత్ సబ్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. సమయపాలన పాటించాలని, అధికారుల సూచనలతో సబ్ స్టేసన్‌లో సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టిపెట్టాలన్నారు.

● వాసవీ నమోస్తుతే

వైభవంగా గాజుల అలంకరణ



పిడుగురాళ్ల జానపాడు రోడ్డులోని వాసవీ అమ్మవారి దేవస్థానంలో అమ్మ జన్మదిన నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఏడోరోజు అమ్మను గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని భక్తులు కనులారా వీక్షించి తరించారు. ఆర్యవైశ్య మహిళలు కుంకుమ పూజలు చేశారు.

– పిడుగురాళ్ల

ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ

మాచర్ల/పిడుగురాళ్ల: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మాచర్ల పల్నాడు, ప్రతిభ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు కళాశాల డైరెక్టర్లు పఠాన్ నాగూర్‌వలి, లక్ష్మీనారాయణ, ఎంవీ నారాయణ, శివభాస్కర్, షేక్ మస్తాన్‌వలి, ఆంజనేయ శాస్త్రి తెలిపారు. పల్నాడు జూనియర్ కాలేజీలో ఎంపీసీ విద్యార్థులు యిమ్మడిశెట్టి మోహన్, వెంకట నరసింహారావు 985, కొమెర అభినయ్ 982 మార్కులు సాధించినట్టు వివరించారు. ప్రతిభ కాలేజీ విద్యార్థి ఎ.పూజిత 981, బైపీసీ విద్యార్థులు షేక్ రూబీనా 966, మైనేడి ప్రసన్న 950, సీఈసీ విద్యార్థి సి.హెచ్. నవ్య 900 సాధించినట్టు వివరించారు.

- కృష్ణవేణి కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ వై.వెంకట్రామయ్య తెలిపారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థులు వైష్ణవి 458, పావని 457, బైపీసీ విద్యార్థి సంతోష్ వర్మ 417, సీఈసీ విద్యార్థి షేక్ షమీర్ 452 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో షేక్ ఖాసిం 979, బైపీసీలో భార్గవి 949, సీఈసీలో సఫ్రిన్ 940, శిరిష 929 మార్కులు సాధించారు. వీరందరినీ కృష్ణవేణి కళాశాల డైరెక్టర్లు అభినందించి సత్కరించారు.
- ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఉత్తమ ప్రతిభ చాటినట్లు ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుల్లయ్య తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల విద్యార్థులు పదిమంది 937 నుంచి 907 మార్కులు సాధించినట్టు వివరించారు.
- పిడుగురాళ్ల పట్టణంలోని స్కాలర్స్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీలో డి.ప్రవళిక 988, బైపీసీలో పి.ధనుష్ లక్ష్మణ్ 981, సీఈసీలో జె.చందన 968 మార్కులు సాధించారని, ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో టి.ఐశ్వర్య 462, సీఈసీలో 482 మార్కులు సాధించారని కళాశాల డైరెక్టర్ జి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వీర్ల అంకమ్మతల్లి, గంగమ్మ తల్లికి పూజలు

దాచేపల్లి : స్థానిక వీర్ల అంకమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహాన్నదానాన్ని పల్నాడు హస్పిటల్ అధినేత చింతలపూడి అశోక్ కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్యతో కలిసి ప్రారంభించారు. గామాలపాడు గ్రామంలోని గంగమ్మ తల్లికి భక్తులు పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పిడుగురాళ్ల జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, సర్పంచ్ జంగా సురేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

చలివేంద్రం ప్రారంభం

మాచర్ల: కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని పౌర సరఫరాల డెప్యూటీ తహసీల్దార్ మురళి అన్నారు. గురువారం కిరాణా మర్చంట్ పట్టణ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్ ప్రాంతంలో చలివేంద్రం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు దేవకి వెంకటశేషు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

దాచేపల్లి : కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం జరిగింది. దాచేపల్లికి చెందిన కొరిమి హరిదాసు భార్య స్రవంతి(28) ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ షేక్ బిలాలుద్దీన్ కథనం ప్రకారం.. హరిదాసు, స్రవంతి దంపతులకు ఇద్దరు పిల్లలు. స్థానికంగా ఉన్న ఫ్యాక్టరీలో హరిదాసు ఉద్యోగం చేస్తున్నాడు. భర్త ఉద్యోగానికి వెళ్లిన తరువాత పై అంతస్తులో ఉండే స్రవంతి తన కుమార్తెను తీసుకువచ్చి కింది అంతస్తులో ఉన్న వారికి ఇచ్చారు. ఎంతసేపటికి స్రవంతి కిందకు రాకపోవటంతో కింద ఉన్న వారు పైకి వెళ్లి చూశారు. ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని స్రవంతి కనిపించింది. విషయం పోలీసులకు తెలియటంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పట్టణంలోని గంగమ్మ తల్లి ఆలయం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ కథనం ప్రకారం... దాచేపల్లి మండలం మాదినపాడుకు చెందిన కోత్రా సాగర్‌బాబు (30) ఆరోగ్యం బాగా లేకపోవడంతో అంజిరెడ్డి హాస్పిటల్లో వైద్య సేవల కోసం వచ్చాడు. టీ తాగుదామని హాస్పిటల్ నుంచి గంగమ్మ ఆలయం వైపు నడుచుకుంటూ వస్తుండగా హైదరాబాద్ వెళ్తున్న లోడ్ లారీ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. సాగర్‌బాబు అక్కడికక్కడే మరణించాడు. మృతుడు సాగర్‌బాబు భార్య సుజాత ఫిర్యాదు మేరకు ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రావెల్ బస్సును ఢీకొట్టిన టిప్పర్

పిడుగురాళ్లరూరల్: పంక్చర్ పడి రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రావెల్ బస్సును వెనుక వైపు నుంచి టిప్పర్ ఢీకొట్టిన ఘటన తుమ్మలచెరువు చెట్టు వద్ద గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి చీరాల వెళ్తున్న కావేరీ ట్రావెల్ బస్సు తుమ్మలచెరువు దగ్గరకు రాగానే మధ్యలో టైర్‌కు పంక్చర్ పడింది. దీంతో బస్సు డ్రైవర్ చంద్రమౌళి రోడ్డు పక్కనే మార్జిన్‌లో ఆపి పంక్చర్ వేసేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో దాచేపల్లి నుంచి పిడుగురాళ్ల వైపు వస్తున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలూ కాలేదు. బస్సులో 38 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆ సమయంలో వీరందరూ బస్సు వద్ద కిందకు దిగి ఉన్నారు. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలువాయిలో వరి పంట కోత ప్రయోగం

పాలువాయి(రెంటచింతల): మండలంలోని పాలువాయి గ్రామంలో గురువారం వరి పంట కోత ప్రయోగం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన గుంటా అంజిరెడ్డి అనే రైతు సర్వేనంబర్ 70-2లో సాగు చేస్తున్న వరిలో ఈ పంటకోత ప్రయోగం చేయగా సగటు దిగుబడి ఎకరాకు 37 బస్తాలు(17.350 కిలో గ్రాములు) వస్తుందని అంచనా వేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ సూపర్‌వైజర్ మల్లికార్జునరావు, పాలువాయి వీహెచ్ఏ తిరుపతి నాయక్, రైతులు పాల్గొన్నారు.